క్లుప్తంగా

ఎమ్మెల్యే కేపీని కలిసిన ఎస్సై


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: మండల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మనాయుడు బుధవారం మార్కాపురంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించారు. మండలంలో శాంతి భద్రతతలను కాపాడాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్సైకి ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డిని ఎస్సై మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు


ఎస్‌ఐ నరసింహారావు

బేస్తవారిపేట: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా బి.నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ మాధవరావు బదిలీపై పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఒంగోలు సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న నరసింహారావు బేస్తవారిపేట పోలీసుస్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరిన ఎస్‌ఐ నరసింహారావు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నా సమాచారం అందించాలని కోరారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు

పుల్లలచెరువు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియా, 20-0-13, 28-28, డీఏపీ వీటితో పాటు రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తీసుకోవాలని ఏవో కోరారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: ఎమ్మార్సీలో ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరపీని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-1,-2 శామ్యూల్‌జాన్, ఇందిర ప్రసాద్ అన్నారు. బుధవారం ఎమ్మార్సీలో జరిగిన ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని తనిఖీ చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి వారం జరిగే ఈ కార్యక్రమానికి విద్యార్థులను తప్పక తీసుకు రావాలని, ఫిజియోథెరపీతో కొంత మేరకు ఉపశమనం ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఫిజియోథెరపిస్టు ఆంకారావు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు లక్ష్మి పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు

కొనకనమిట్ల: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందవచ్చని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి పేర్కొన్నారు.బుధవారం చినారికట్ల, నాగరాజుకుంట గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. సున్నా వడ్డీ, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, రైతు భరోసా, పీఎం కిసాన్ వర్తించాలంటే ఈ క్రాప్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. రైతులు పంటలు సాగుచేసే సమయంలో నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. విత్తనశుద్ధి, ఎరువుల వాడకం, పురుగు మందుల పిచికారీపై సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం రైతులతో కలిసి పత్తి, కంది, ఉద్యాన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

అమ్మ ఆశ్రమంలో వృద్ధురాలి చేరిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నిస్సహాయ స్థితిలో కుటుంబ సమస్యలతో బాధపడుతున్న రంగమ్మ అనే వృద్ధురాలిని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘసేవకులు బీఎస్ నారాయణరెడ్డి బుధవారం కొంగలవీడు రోడ్డులోని అమ్మ ఆశ్రమంలో చేర్పాడు. అమ్మ ఆశ్రమం నిర్వాహకురాలు తిరుపతమ్మతో మాట్లాడి రంగమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

319 మందికి వైద్య పరీక్షలు

కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్ల గ్రామంలో బుధవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గిద్దలూరుకు చెందిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, వైద్య సిబ్బంది 319 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్ల కోసం 46 మందిని, ఈఎన్‌టీ ఆపరేషన్ల కోసం ఐదుగురిని, జనరల్ ఆపరేషన్ల కోసం 7 గురిని గుర్తించామని, వీరందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు.

ఆదర్శనీయుడు ప్రకాశం పంతులు


మార్కాపురంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జంకె


దర్శిలో నివాళులర్పిస్తున్న నేతలు


ప్రకాశానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్


ముండ్లమూరులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


గొట్లగట్టు జెడ్పీ పాఠశాలలో టంగుటూరి చిత్రపటానికి నివాళి

మార్కాపురం: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మహనీయుడని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కొనియాడారు. బుధవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జంకె వెంకటరెడ్డి తన నివాసంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, పార్టీ నాయకులు మందటి మహేశ్వరరెడ్డి, పంబి వెంకటరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ కిట్స్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో టంగుటూరి టంగుటూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ వెన్నా కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిల్‌కుమార్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు సుధారాణి, సునీత, ఇగ్నైట్ యంగ్ మైండ్ ప్రోగ్రాం నియోజకవర్గ కోఆర్డినేటర్ మండ్ల రామాంజనేయులు, గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఆధ్వర్యంలో టంగుటూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు జీవిత చరిత్ర, పోరాట పటిమను విద్యార్థులకు వివరించారు.

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడు, ప్రగళ్లపాడు గ్రామాల్లో జెడ్పీహెచ్, ఎంపీపీ పాఠశాలల్లో టంగుటూరి పకాశం పంతులు జయంతి ప్రధానోపాధ్యాయులు పి.అంజలి, గుర్రపుసాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ బలుసుపాటి లూధియా, నాయకులు బి.నాగరాజు, పాఠశాల చైర్మన్ ఏర్వ శివారెడ్డి పాల్గొన్నారు.

దర్శి: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డిలు ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పుట్టరవి, గంజి వెంకటేశ్వరరెడ్డి, మురళీ, ఖాశీం, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టంగుటూరిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

కురిచేడు: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ముండ్లమూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన తాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవీలత, ఉపాధ్యాయులు హజరత్‌ఆలీ, శ్రీనివాసరావు, భారతి, చక్రపాణి, శ్రీదేవి, భవన్నారాయణ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

● మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ


ఎరువులను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ

తాళ్లూరు(ముండ్లమూరు): రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ అన్నారు. తాళ్లూలోని రెండు రైతు భరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఎరువుల కేంద్రాన్ని పరిశీలించి స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో రైతుల అవసరాలను బట్టి 1800 మెట్రిక్ టన్నుల అమ్మకాలు జరిగాయన్నారు. రైతుల కోసం 7020 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరకే అమ్మకాలు జరపాలన్నారు. ఎప్పటికపుడు రైతుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన ఎరువులు తెప్పించాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలను ఎప్పటికపుడు ఈ క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు చిత్తశుద్ధితో పనిచేసి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట బి.ప్రసాదరావు, హబ్ ఏఈఓ వెంకటరావు, వీఏఏలు నాగరాజునాయక్, వెంకటరావులు పాల్గొన్నారు.

జయహో ఇస్రో


విక్టరీ సింబల్ చూపుతున్న తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు


చంద్రయాన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు


మార్కాపురంలోని వివేకానంద విద్యాపీఠం స్కూల్లో చంద్రయాన్-3 లైవ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు


పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం/తర్లుపాడు: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ విజయవంతంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండ్ కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మార్కాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్లపై చంద్రయాన్-3 ల్యాండింగ్ దృశ్యాలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు.

ఇస్రోకు ఎమ్మెల్యే కేపీ, జంకె అభినందనలు

మార్కాపురం టౌన్: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడంపై ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. దేశ ప్రతిష్టను మరింత పెంచిన శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ నేతల పూజలు చంద్రయాన్ విజయవంతం కావాలని కోరుతూ మార్కాపురంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు ఇమ్మడిశెట్టి వీరారావు, బీజేపీ నేతలు శాసనాల సరోజిని, కేవీ రమణారావు, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జీవీ రెడ్డి, దేవిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంభం: చంద్రయాన్-3 ల్యాండర్ జాబిల్లిపై విజయవంతంగా దిగాలని ఆకాంక్షిస్తూ బుధవారం స్థానిక వాసవీ విద్యానికేతన్ విద్యార్థులు జయహో చంద్రయాన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చంద్రయాన్-3 భంగిమలో ప్రదర్శన చేసి అందరినీ అలరించారు. చంద్రయాన్-3పై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ గోళ్ల సుబ్బరత్నం, కల్పన , ప్రిన్సిపాల్ కేకే బిందు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: అంతరిక్షంలో భారత ఖ్యాతిని చాటినందుకు స్థానిక జీవనజ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రుడిపై చంద్రయాన్-3 అడుగు పెట్టిన సన్నివేశాలను విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముక్తకంఠంతో చందమామపై మువ్వన్నెల జాతీయ జెండా ఎగరవేసినందుకు గర్వంగా ప్రతి భారతీయుడు ఆనందించాలని నినాదించారు.

బత్తాయికి వేరుకుళ్లు తెగులు


రైతులకు సూచనలు ఇస్తున్న హెచ్‌వో ఆదిరెడ్డి

యర్రగొండపాలెం: ప్రస్తుత బెట్ట పరిస్థితుల్లో బత్తాయికి వేరు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని, వెంటనే సస్యరక్షణ చర్యలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి పి.ఆదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోయలపల్లి గ్రామంలోని బత్తాయి తోటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. బత్తాయి చెట్లకు వేరుకుళ్లు ఆశించడంతో ఆ చెట్లు ఎండిపోతాయని, దీని నివారణకు ట్రైకోడెర్మా అభివృద్ధి చేసిన పశువుల ఎరువులను చెట్లపాదుల్లో కలుపుకోవాలన్నారు. ఒక క్వింటా పశువుల ఎరువుకు కిలో ట్రైకోడెర్మాను కలిపి నీడ ఉన్న ప్రదేశంలో వారం నుంచి 10 రోజుల పాటు నీళ్ల చల్లుతూ పెంచుకోవాలని చెప్పారు. ఆ విధంగా పెంచిన ఎరువును చెట్ల పాదుల్లో వేసుకోవాలన్నారు. బత్తాయి తోటల్లో సూక్ష్మ పోషాల లోపాలు నివారించుకోవటానికి ఫార్ములా ఫోర్ లేకుంటే ఫార్ములా సిక్స్ లీటర్ నీటికి ఐదు గ్రాముల ప్రకారం కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. నీటి ఎద్దడిని తట్టుకునే హైబ్రిడ్ నేరేడు, ఉసిరి, సీతాఫలం, వాక్కాయ, హైబ్రిడ్ చింత లాంటి పండ్ల తోటలను పెంచుకోవాలని, అందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు.

బత్తాయి తోటల పరిశీలన

అర్ధవీడు (కంభం): మండలంలోని నాగులవరం గ్రామంలోని బత్తాయి తోటలను బుధవారం ఉద్యానవన శాఖ అధికారి డి. శ్వేత పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఆకుముడత ఆశించిన ఆకుపై తెల్లటి పొరలు ఏర్పడి ఆకు ముడతలు ఏర్పడి గజ్జి తెగులు ఎక్కువగా ఆశించిన ఆకులు రాలిపోవడం జరిగిందని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

రూ.1.60 లక్షలు నష్టం


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదెలు

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధిలోని బక్కయ్యచెరువు పొలాల్లో రెండు గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం మృతి చెందాయి. పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పలపాటి పెద్ద గాలెయ్య గేదెలు మేత కోసం పొలానికి వెళ్లాయి. తిరిగి ఇంటికి రాకపోవటంతో వాటిని వెతుక్కుంటూ బుధవారం పొలాల్లో తిరుగుతుండగా గేదెలు మృతి చెంది కనిపించాయి. అడవిపందుల కోసం పొలాలకు విద్యుత్ కంచెను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఆ కంచెకున్న విద్యుత్ సరఫరా పగలు కూడా అలాగే ఉండటంతో మేతకోసం వెళ్లిన గేదెలు మృత్యువాతపడ్డాయి. గేదెల ఖరీదు సుమారు రూ.1.60 లక్షలని రైతు గాలెయ్య వాపోయాడు. అక్రమంగా విద్యుత్ కంచెలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పంట నమోదు పరిశీలన


పంట నమోదు పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: మండలంలోని వీర వెంకటాపురం రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న ఈ పంట నమోదును వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లతో కూడిన బృందాలు పంట పొలాన్ని సందర్శించి పంట నమోదు చేయాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా పంట నమోదు చేయాలన్నారు. బీడు భూములు, బంజరు భూముల వివరాలు ముందుగానే తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో ముందుగానే పంట నమోదు విషయాలను రైతులకు ఆర్‌బీకే సిబ్బంది తెలియజేయాలని ఏఓ తెలిపారు.

రైల్వేగేట్ల సమస్యను పరిష్కరించాలి


డీఆర్‌ఎంతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్లగేటు, పాములపల్లె రైల్వే గేటు సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి బుధవారం గుంటూరులోని రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వేగేట్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల పాములపల్లె గేటు వద్ద అనారోగ్యానికి గురైన వ్యక్తిని భుజాల మీద మోసుకుంటూ వైద్యశాలకు తరలించారని, అటువంటి సమస్యలతోనే కాకుండా వాహనదారులు గంటల కొద్దీ గేట్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజలు పడుతున్న ఇటువంటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గేట్ల సమస్య పరిష్కారానికి మార్గం చూడాలని ఆయన కోరారు.

పారిశుధ్య కార్మికుల నిరసన


ఎంపీడీవోకు వినతిపత్ర ఇస్తున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: మండలంలోని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి తమకు జీతాలు చెల్లించాలని కార్మికులు కోరారు. సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కొమరోలు: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని స్వచ్ఛ భారత్ కార్మికులు కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డి.నరసయ్యకు తమ సమస్యలపై బుధవారం వినతిపత్రం సమర్పించారు. స్వచ్ఛ భారత్ కార్మికులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినప్పుడు స్వచ్ఛ భారత్ కార్మికుల జీతాలు చెల్లిస్తామని అధికారులు తెలిపారని, ఇప్పటి వరకు జీతాలు చెల్లించలేదని, వెంటనే జీతాలు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టండి

● విద్యుత్‌శాఖ ఏడీఈ పిచ్చయ్య


సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఈ పిచ్చయ్య

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్‌శాఖ ఏడీఈ కె.పిచ్చయ్య అన్నారు. తాళ్లూరులో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల నుంచి సకాలంలో బిల్లులు వసూలు చేయాలన్నారు. పెండింగ్ ప్రభుత్వ బకాయిల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ బకాయిలు రూ.1.63 కోట్లు, ప్రైవేట్ బిల్లులు రూ.2.45 కోట్లు బకాయిల వసూళ్లకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఏఈ వీరబ్రహ్మం, ఎల్‌ఐలు శ్రీనివాసరావు, కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు


సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన వారికి బుధవారం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం శామ్యూల్ జాన్, ఉపాధ్యాయులు నాగమూర్తి, నారాయణరెడ్డి, శ్రీనివాస్, రామానాయక్, శంకర్, పవన్‌లకు హెచ్‌ఎం రమాదేవి ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఎంఈవో పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులను శాస్త్రవేత్తలను చేయడమే పొలం బడి ఉద్దేశం


మొక్కను పరిశీలిస్తున్న ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తదితరులు

మార్కాపురం రూరల్: రైతులను శాస్త్రవేత్తలను చేయడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మార్కాపురం మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. కంది పంటలో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం ఉద్యానవన అధికారి రమేష్, నాయుడుపల్లి వీఏఏ పావని, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు


కోట సత్యమణికంఠుడు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపం కోట సత్యమాంబ ఆలయ ప్రాంగణం కోట సత్యమణికంఠుడు ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం రుద్రాభిషేకం, రుద్రహోమం, గ్రామోత్సవం, అన్నాభిషేకం, సహస్రఘట కలిశాభిషేకం, సాయంత్రం స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం, రాత్రికి అన్నదానం ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాలపర్తి దేవదాసు

ముండ్లమూరు: మండలంలోని నాయుడు పాలెం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో పాలపర్తి దేవదాసుకి గాయాలయ్యాయి. మారెళ్ల గ్రామానికి చెందిన దేవదాసు ద్విచక్రవాహనంపై బుధవారం ముండ్లమూరు బయలుదేరారు. మార్గ మధ్యలో నాయుడుపాలెం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ద్విచక్ర వాహనంపై మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వాహనంలో ఒంగోలుకు తరలించారు.

సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై అవగాహన

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్ట్ ఆధ్వర్యంలో మిర్చి రైతులకు సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై రిసోర్స్ పర్సన్ లక్ష్మీరెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. సాగుచేసే పంటల్లో వచ్చే తెగుళ్లను అరికట్టాలని, ఆకు ముడత, నల్ల దోమ వంటివి పంటలపై వాలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లక్ష్మీరెడ్డి తెలిపారు. మిర్చిలో అంతర పంటలైన సజ్జ, ఆముదాలు, ఉల్లి నారు సాగు చేయటం వలన పంట నష్టం వాటిల్లకుండా ఉంటుందని లక్ష్మీరెడ్డి తెలిపారు. ఎఫర్ట్ సంస్థ టీమ్ జెస్సీగ్లోరీ, నాసరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు అయిన శ్రీమతి జి.రంగలక్ష్మి, భర్త పిచ్చయ్య శ్రీనగర్, 3వలైను, అరండల్‌పేట, గుంటూరు వారి నుండి సంజాయిషి పొంది ఇచ్చిన పబ్లిక్ నోటీసు.

మా క్లయింటు శ్రీ చెరుకుపల్లి రంగనాయకులు గారి పెద్దకుమార్తె అయి ఉన్నది. మా క్లయింటుకు 4గురు సోదరులు, ఇద్దరు సహోదరీలు కలరు. మా క్లయింటు తండ్రి షెడ్యూల్ ఆస్తికి యజమాని, అతని తదనంతరము షెడ్యూల్ ఆస్తి ఈ రోజు వరకు వారసులమధ్య భాగపంపిణీ జరుగక ఉమ్మడి ఆస్తి గాని యున్నది. మా క్లయింటు ఆమె చెల్లెండ్రు అయిన శ్రీమతి నారాయణమ్మ, శ్రీమతి రంగమ్మ అనే వారికి తెలియకుండా కంభం (గ్రా), ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, తండ్రి చినగాయ్య, షెడ్యూలు ఆస్తిని ది.27.11.2018, 01-10-2021న రంగనాయకుల కుమారుల ద్వారా GPA, పార్టిషిన్ దస్తావేజు పొంది అక్రమ మార్గంలో షెడ్యూల్ ఆస్తిని అముటకు ప్రయత్నములు చేయుచున్నట్లు మా క్లయింటుకు తెలిసినది. మా క్లయింటు గాని ఆమె చెల్లెండ్రు కాని ఎటుఎంటి సంతకములు చేయని దస్తావేజులు చెల్లవు, చట్టపరంగా పై దస్తావేజులకు విలువలేదు. షెడ్యూల్ ఆస్తిని ఎవరైనా అమ్మిన, కొనుగోలు చేసినా వారిపై మా క్లయింటు సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును. కొత్తపల్లి వెంకటేశ్వర్లు షెడ్యూల్ ఆస్తిని అమ్ముటకు అనర్హుడు. కనుక కొనుగోలు చేయువారు షెడ్యూలు ఆస్తిని అతని వద్ద నుండి కొనవద్దని ఈ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నారు. మా క్లయింటు తప్పుడు GPA, పార్టిషిన్ దస్తావేజు పొందిన వెంకటేశ్వర్లు పై తగు సివిల్, క్రిమినల్ చర్యలు ప్రారంభించి యున్నందున ఎవరైనా షెడ్యూల్ ఆస్తిని కొనిన యెడల జరుగబోవు నష్టానికి వారే పూర్తి బాధ్యతవహించవలసి ఉంటుందని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్: హజరత్‌గూడేం గ్రామం, కంభం మండలం, కంభం స:రి:ఇ, మార్కాపూర్ రెవె డిస్ట్రిక్ట్, ప్రకాశం జిల్లా S.No.359/1లో ఎ0.90 సెంట్లు 360/1లో ఎ0.23 సెంట్లు, 358లో ఎ 0.27 సెంట్లు వెరసి ఎ 1.40 సెంట్లు.

Dr. S.S.S. JayaRaju, (Rtd), District Judge, Cell: 94402 35617
Smt J.Jyothsna Rani, Cell: 90958 49955, Smt J.Kusuma Presna Vani, Cell: 75697 31830
Advocates, A.P. High Court, Bharatpet, Guntur.